క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చింతపల్లిరూరల్: సీజనల్ వ్యాధుల పట్ల గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని తాజంగి పీహెచ్ వైద్యుడు సంతోష్ అన్నారు. వాతావరణ మార్పులు దృష్టిలో పెట్టుకుని ఆరోగ్య పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇంటి వద్ద వర్షపు నీరు నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

లేని యెడలా మలేరియా, డేంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. జ్వరాలు,లే రేదైన రోగం బారిన పడితే వెంటనే సమీపంలో ఉన్న ఆస్పత్రిని సంప్రదించాలి, నిర్లక్ష్యం చేయవద్దని యన సూచించారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న ప్రజలు

కశింకోట : రిక్షా స్టాండ్ వద్ద వెలసిన అభయాంజనేయస్వామి ఆలయాన్ని శనివారం ప్రజలు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్య నారాయణ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా హనుమజ్జయంతి రోజు నిర్వహించాల్సిన అన్న సమారాధనను ఇప్పుడు భారీగా నిర్వహించారు. ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఉత్సాహంగా హాజరయ్యారు. యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రేజేటి మారుతి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొల్లి రామంజి, ఇంటి ఈశ్వర రావు, కొల్లి సూరిబాబు, బి. త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో రుద్రహోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం: వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం వైభవంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శనివారం స్థానిక పెద్దమిల్లు జంక్షన్‌లో వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం, లక్ష్మీగణపతి హోమం, మృత్యుంజయ హోమంతోపాటు స్వయంభూ లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఆలయ అర్చకుడు దొరబాబుశర్మ పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు

కశింకోట : మండలంలోని వెదురుపర్తి గ్రామంలో వెలసిన దుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారిని నూతన వస్త్రాలు, పూలమాలలు, నిమ్మకాయ దండలతో అందంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు శంకరరావు ఆధ్వర్యంలో కుంకుమార్చన, క్షీరాభిషేకం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మోదమాంబకు ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: వి.వి.అగ్రహారం గ్రామంలోని గురుమాత పాలకుర్తి శ్రీనివాస రావు స్వగృహంలో ఏర్పాటు చేసిన మోదమాంబ అమ్మ వారి పీఠంలో నిత్య పూజలు నిర్వహిస్తున్నా రు. ఈ నెల 16వ తేదీ వరకు ఇక్కడ పూజలు నిర్వహించి, 17న మాలధా రణ విసర్జిస్తామని గురుమాత శ్రీనివాసరావు తెలిపారు. అమ్మవారి సారె ఊరేగింపు కార్యక్రమం త్వరలో నిర్వహిస్తామన్నారు. కె.జె.పురం మోదమాంబ ఆలయంలో మాలధారణ భక్తులు ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహిస్తున్నారు.

మన్యం బీట్‌రూట్.. అదరహో

- మైదాన ప్రాంతాల్లో డిమాండ్
- చేతికి అందిన పంట
- సంతల్లో పెరుగుతున్న ధరలు
- ఆనందంలో గిరిజన రైతులు

చింతపల్లిరూరల్: ఏజెన్సీలో పండించే అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలకు మైదాన ప్రాంతాల్లో గిరాకీ ఎక్కువ. ఇందుకు ఇక్కడి వాతావరణం ,సేంద్రియ పద్ధతుల సాగు ప్రధాన కారణం. ఉత్తమ పోషకాల్లో ఒకటిగా బీట్‌రూట్‌కు పేరొంది. రక్తహీనత సమస్య పరిష్కారానికి బీట్‌రూట్‌ను ఎక్కువగా వినియోగిస్తారు.. ఏజెన్సీ వాతావరణం బీట్‌రూట్ ఎంతో అనుకూలంగా ఉండడంతో పాటు భూసారం ఈ పంటకు మరింత దోహదపడుతుంది. మన్యంలో పండించే బీట్‌రూట్‌కు మైదాన ప్రాంత మార్కెట్‌లలో ఏటా డిమాండ్ పెరుగుతోంది. ఫలితంగా బీట్‌రూట్‌ను విస్తారంగా పండిస్తున్నారు.

బీట్‌రూట్ సాగు కోసం స్థానిక ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పలు సూచనలిస్తున్నారు. ఈ సందర్భంగా చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త శివకుమార్ మాట్లాడుతూ మన్యంలో గిరిజనులు వివిధ రకాల కూరగాయాలతో పాటు బీట్‌రూట్‌ను వాణిజ్యపరంగా సాగుచేస్తున్నట్టు చెప్పారు. బీట్‌రూట్ క్యానింగ్ చేయడానికి ఇక్కడి నేలలు అనవుగా ఉంటాయని, లోతైన, సారవంతమైన ఇసుక నేలలు అనువైనవి. అధిక క్షారత గల చౌడుభూములో సాగు చేయవచ్చని మన్యంలో చల్లని వాతవరణం సాగుకు అనూకులంగా ఉంటుందని చెబుతున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా 15 రోజులు వ్యవధిలో విత్తుకుంటే గిట్టుబాటు ధరలు పొందవచ్చని చెబుతున్నారు .ఒక్క సిడ్ బాల్‌లో రెండు కంటే ఎక్కువ విత్తనాలు ఉంటాయి. ఎకరాకు 3 కిలోల విత్తనం సరిపోతుందని, వరుసల మధ్య 45 సెంటీమీటర్లు ఉండేలా, మొక్కల మధ్య 10 సెంటీ మీటర్లు దూరం ఉండేలా విత్తుకోవాలని సూచిస్తున్నారు.



ఇండియన్ బీట్‌రూట్

తీసుకోవలసిన జాగ్రత్తలు

బీట్‌రూట్ సాగులో గింజలు మొలకెత్తిన తర్వాత ఒక్కో గింజ బాల్ నుంచి 2 నుంచి 6 మొలకలు వచ్చే అవకాశముంది. బలమైన మొలక ఉంచి మిగిలినవి తొలగించాలని చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త శివకుమార్ సూచిస్తున్నారు. ఇలా కనీసం రెండు సార్లు చేసి మొలకెత్తిన 25 రోజుల తరువాత కలుపుతీసి మట్టి ఎగదోయాలి. దీని వలన బీట్‌రూట్ గడ్డ బాగా ఊరుతుందని చెబుతున్నారు.

మైదాన ప్రాంతాలకు తరలింపు

చింతపల్లి మండలంలో చౌడుపల్లి ,పెంటపాడు, జీకే వీధి మండలం రింతాడ, మాలిగూడ, దారకొండలో బీట్‌రూట్ ఎక్కువ సాగు చేస్తున్నారు. సుమారు 60 ఎకరాల్లో పండిస్తున్నారు. రైతులు పండించిన బీట్‌రూట్‌ను మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. నేరుగా లేక వారపు సంతల్లో కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు తరలిస్తుంటారు. అనకాపల్లి, నర్సీపట్నం, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వస్తుంటారని రైతులు చెబుతున్నారు. సంతల్లో 10 కిలోల గంప రూ.500 నుంచి రూ.800 వరకు విక్రయిస్తున్నారు.



క్రిమస్స్ గ్లోబ్ రకం బీట్‌రూట్

బీట్ రూట్‌లో రకాలు:

- ట్రాయుడ్ డార్క్ రెండవ పంటకాలం 80 నుంచి 100 రోజులు. అధిక దిగుబడి ఇస్తుంది. గడ్డిపై పోర బాగా ఎర్రగా ఉంటుంది.
- **క్రిమస్స్ గ్లోబ్:** గడ్డ గుండ్రంగా ఉంటుంది. పై పోర లేత ఎరుపు రంగులో ఉంటుంది. పంట కాలం 3 నెలలు. దిగుబడి బాగుంటుంది.
- **ఎర్లీ వండర్:** పంటకాలం రెండు నెలలు. గడ్డ ఎర్రగా ఉంటుంది.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



బీట్‌రూట్ సాగులో సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చు. ఏజెన్సీలో సేంద్రియ పద్ధతిలో పండించడం వలన పండించిన కూరగాయలకు మైదాన ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంది. రైతులు అధిక లాభాలు పొందుతున్నారు

– **శివకుమార్**, ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త, చింతపల్లి

పాఠశాలల్లో ప్రవేశాలు ప్రారంభం

అరకులోయటౌన్: మండలంలోని రవ్వలగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో 3వ తరగతి నుంచి 10 వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి ఆహ్వానిస్తున్నట్టు హెచ్‌ఎం కెందు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రామ్మూర్తి తెలిపారు. వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. 2024–25 విద్యా సంవత్సరానికి పాఠశాలలో 3వ తరగతిలో–40సీట్లు, 4వ తరగతిలో–38, 5వ తరగతిలో–26, 6వ తరగతిలో–54, 10వ తరగతిలో–16 సీట్లు ఖాళీలు ఉన్నట్టు చెప్పారు. గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల పనివేళల్లో తమకు సంప్రదించి విద్యార్థులకు అడ్మిషన్‌లు పొందవచ్చని వారు తెలిపారు.

డుంబ్రిగుడ (అరకులోయటౌన్): డుంబ్రిగుడ మండలంలోని గుంటసీమ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో 3వ తరగతి నుంచి 10 వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల హెచ్‌ఎం దురియా కోగేశ్వరరావు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. 2024–25విద్యా సంవత్సరానికి పాఠశాలలో 3వ తరగతి, 4, 5, 6వ తరగతుల్లో 30 సీట్లు చొప్పున మొత్తం–120 సీట్లు, 7వ తరగతిలో–23 సీట్లు, 8, 9, 10వ తరగతిలో–10 సీట్లు చొప్పున మొత్త– 30 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల పనివేళల్లో సంప్రదించి విద్యార్థులకు అడ్మిషన్‌లు పొందవచ్చని హెచ్‌ఎం కోగేశ్వరరావు తెలిపారు.

కొయ్యూరు: మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాల–1 మూడో తరగతిలో– 40 సీట్లు, నాలుగులో–20, ఐదు తరగతిలో– 16 సీట్లు ,ఆరో తరగతిలో –39 సీట్లు, ఏడు తరగతిలో–28 సీట్లు, తొమ్మిది తరగతిలో –17 సీట్ల ఖాళీలున్నట్టు హెచ్ ఎం ఎస్ భక్తవత్సల మూర్తి శనివారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు పాఠశాల ఉపాధ్యాయులను సంప్రదించాలని కోరారు. 9, 10 తరగతుల్లో ప్రత్యేక వృత్తి విద్య తరగతులు, ఎలక్ట్రానిక్స్, బ్యాంకింగ్ ,బీమా కోర్సులపై శిక్షణ ఇస్తామన్నారు. పది ఉత్తీర్ణత సాధించిన తరువాత ఉపాధి పొందేందుకు వీలు కలుగుతుందన్నారు. పూర్తి వివరాలకు తమను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి కల్యాణ వేంకటేశ్వర ఉత్సవాలు ప్రారంభం

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామివారి 14వ వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ రాపేట రామకొండలరావు, కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు స్వామివారి పెళ్లిరాట కార్యక్రమంతో ఉత్సవాలకు అంకురార్పణ చేస్తామన్నారు. ఈ నెల 16వ తేదీన ఉదయం పుట్టమట్టి తీసుకురావడం, అంకురార్పణ, నవకలశ స్నపనం, నిజరూప దర్శనం, పూజా కార్యక్రమాలు జరుగుతాయని, 17వ తేదీ ఉదయం ఎదురు సన్నాహం, అనంతరం 9 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం, మధ్యాహ్నం నుంచి ఆలయ సమీపంలో అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. ఆలయంలో భక్తిగీతాల ఆలాపన, అనంతరం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం ఉంటుందన్నారు. 22వ తేదీ ఉదయం నుంచి వసంతోత్సవం, నాగవల్లి సంబరాలు, రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ, పవలింపు సేవతో ఉత్సవాలు ముగిస్తాయని పేర్కొన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు ముందుగా రూ.2 వేలు కమిటీ వారికి చెల్లించాలన్నారు. ఉత్సవాల నిర్వహణకు బియ్యం, లేదా ధన రూపంలో సమర్పించాలని కోరారు.

గంజాయి పట్టివేత

సీతమ్మధార: గుట్టుగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు జిల్లాకు చెందిన కిల్లో లచ్చన్న, కాకినాడకు చెందిన గరికిన మెషేక్ అనే ఇద్దరు యువకులు ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీఎల్‌బీ గ్రౌండ్ సమీపంలో సంచరిస్తున్నారు. అటు వైపు వెళ్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న వాద్దరినీ విచారించి, వారి బ్యాగ్‌లో తనిఖీ చేసి చూడగా రెండు కిలోలు గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే యువకులను అదుపులోకి తీసుకొని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

ఉద్యోగాల కల్పనకు ముందడుగు

- ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రత్యేక పోర్టల్
- ఒక క్లిక్ దూరంలో ఉద్యోగ అవకాశం
- ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌తో సులువుగా ఉద్యోగ సమాచారం
- నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌తో అనుసంధానం
- మోడల్ కెరీర్ సెంటర్లుగా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లు



ఉద్యోగాలు పొందిన యువతతో ఎంప్లాయిమెంట్ అధికారులు, సంస్థల ప్రతినిధులు (ఫైల్)

కంచరపాలెం: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు సాంకేతిక వ్యవస్థను ఉపయోగించి ఉపాధి కార్యాలయాల స్వరూపాన్ని మార్చివేశారు. గతంలో అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ కార్యాలయాలకు రోజుల తరబడి తిరిగి క్యూలో నిలబడి విద్యార్హతల వివరాలను నమోదు చేసుకునేవారు. అయితే ఇప్పుడు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా వెసులుబాటు వచ్చింది. ఇందుకోసం ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించారు. దీనిని నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌తో అనుసంధానం చేశారు. https:// employment. ap. gov. in/ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే లాగిన్ వివరాలు, రిజిస్ట్రేషన్ నంబర్ సదరు ఫోన్ నంబర్‌కు ఎస్ఎంఎస్, ఈ మెయిల్ ద్వారా పొందవచ్చు. ఎంప్లాయిమెంట్ కార్డును సైతం లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవచ్చు. దీంతో పాటు ఎంప్లాయిమెంట్ కార్డ్ రెన్యూవల్, ఆదనపు విద్యార్హతల నమోదు వంటి సేవలు సైతం ఆన్‌లైన్ ద్వారా పొందేందుకు అవకాశం ఉంటుంది.

సులువుగా ఉద్యోగ సమాచారం

రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు జారీ చేసిన నోటిఫికేషన్ సమగ్ర సమాచారం, ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల ఖాళీల వివరాల ఎంప్లాయిమెంట్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ఎప్పటికప్పుడు సమాచారం అందుతుంది. విద్యార్హతల ప్రకారం ఉద్యోగాల ఖాళీల వివరాలు యువత ఫోన్ నంబర్లు, ఈ మెయిల్‌కు అలెర్ట్ మెసేజ్‌లు వస్తాయి. వీటితో పాటు ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాల సమాచారం అందిస్తూ అటు యువతకు ఇటు జిల్లాలో పలు సంస్థలకు వారధిగా ఉపాధి కల్పన కార్యాలయ సిబ్బంది నిలుస్తున్నారు.

జిల్లాలో చురుగ్గా రిజిస్ట్రేషన్ ప్రక్రియ

కంచరపాలెంలోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. దీంతో యువత పెద్ద ఎత్తున తమ విద్యార్హతలను నమోదు చేసుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ప్రైవేట్ సంస్థల్లోని ఉద్యోగావకాశాల వివరాలను పోర్టల్ ద్వారా పొందుతూ, ఎప్పటికప్పుడు తమ వివరాలను అప్‌డేట్ చేసుకుంటున్నారు. ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగానికి దరఖాస్తు చుసుకోవాలంటే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కార్డు నంబర్ తప్పనిసరి అనే నిబంధన ఉండేది. ప్రస్తుతం అటువంటి నిబంధనలకు చరమగీతం పాడుతూ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఐదేళ్లలో అనేక సంస్కరణలు వచ్చాయి.

విశాఖ జిల్లా ఉపాధి (నేషనల్ కెరీర్ సెంటర్) కార్యాలయంలో 2024 మార్చి 31 నాటికి నమోదు చేసుకున్న అభ్యర్థుల వివరాలు

విద్య స్థాయి వివరాలు	నమోదు చేసుకున్న అభ్యర్థులు
టెన్త్	5,445
ఇంటర్మీడియట్	7,353
డిగ్రీ	9,275
స్టెనోగ్రాఫర్స్	318
టైపిస్టులు	2,807
బీఈడీ టీచర్లు	1,024
సెకంటరీ గ్రేడ్ టీచర్లు	449
డిప్లొమో	3,586
ఐటీఐ	6,947
ఇంజనీరింగ్	1,7629
వైద్యులు	2,120
ఇతరులు	12,023



విశాఖ జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం

యువత అవకాశాలను వినియోగించుకోవాలి



యువత కోసం పెద్ద ఎత్తున జాబ్ మేళాలు నిర్వహిస్తున్నాం. టెన్త్ నుంచి ఉన్నత విద్య అభ్యసించిన వారు ఆన్‌లైన్ ఎంప్లాయిమెంట్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. దీంతో ఎప్పటికప్పుడు యువత కేంద్ర, రాష్ట్ర, ప్రైవేటు ఉద్యోగాల ఖాళీల సమాచారం పొందవచ్చు. రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన ఫోన్ నంబర్ యూజర్ ఐడీగా పరిగణిస్తాం. యువత ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

–**సిహెచ్ సుబ్బిరెడ్డి**, జిల్లా ఉపాధి అధికారి, విశాఖ

ఉత్సవ సందడి

- నేటి నుంచి 11వ తేదీ వరకు మోదకొండమ్మ ఉత్సవాలు
- తరలిరానున్న భక్తులు
- పూర్తయిన ఏర్పాట్లు

పెదబయలు: మన్య ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ తల్లి ఉత్సవాలు మండల కేంద్రం పెదబయలులో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పెదబయలులో కూడా పాడేరు మోదకొండమ్మ ఉత్సవాల తేదీ ల్లోనే ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతున్నాయి. పద్దెనిమిదో ఏటా ఉత్సవాలు జరుగుతున్నాయి.. అయితే ఈ ఏడాది మూడు రోజుల ఉత్సవాలు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకుగాను అన్ని ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు

మూడు రోజుల పాటు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, మోదమ్మ తల్లి ఘటాల ఊరేగింపు తదితర కార్యక్రమాలు జరుగుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 7.30 గంటలకు అమ్మవారి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాన్ని అమ్మవారి పాదాలకు ఊరేగింపుగా శతకం పట్టువద్దకు కొలువుదీరుస్తారు. మూడు రోజుల ఉత్సవాల్లో వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు జరుగకుండా ఏర్పాటు చేస్తున్నారు.ఈ ఉత్సవాలు అమ్మవారి విగ్రహదాత జోగి రాము ఉత్సవారి విగ్రహాన్ని ఎత్తుకుని పండగ ప్రారంభిస్తారు. ఉత్సవాలకు ఆంధ్రా, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. మూడో రోజు మంగళవారం మధ్యాహ్నం నుంచి ఉత్సవ విగ్రహం, పాదాలను ఊరేగిస్తూ శతకంపట్టు నుంచి తిరిగి అమ్మవారి గుడిని విగ్రహాలు చేరుస్తారు. అనంతరం గుడి ఆవరణలో భారీగా బాణాసంచా, మందుగుండు సామాన్లు పెద్ద ఎత్తున పేలుస్తారు.మూడు రోజుల పాటు రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.అమ్మవారి ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చి విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.మూడు రోజుల ఉత్సవాలకు ఎలాంటి తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని గ్రామ పంచాయతీ సర్పంచ్ పలాసి మాధవరావు తెలిపారు.



పెదబయలులో ముస్తాబవుతున్న మోదకొండమ్మ ఆలయం

ఉత్సవాల్లో పోలీసు బందోస్తు

మూడు రోజుల మోదకొండమ్మ ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా పోలీసు బందోబస్తు నిర్వహించినట్టు స్థానిక ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.మూడు రోజుల ఉత్సవాల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లు ఇతర అసాంఘిక కార్యక్రమాలు చేస్తే చర్యలు తప్పవన్నారు.ఉత్సవాలు ప్రశాంతంతా జరిపేందుకు మండల ప్రజలు, భక్తులు సహకరించాలని కోరారు. అలాగే ఇప్పటికే ఉత్సవ కమిటీ వారికి జి.మాడుగుల సీఐ రమేష్,స్థానిక ఎస్ఐ మనోజ్‌కుమార్ ప్రశాంతంగా పండగ నిర్వహించేందుకు ప్రజలు సహకారం అందించాలని కోరారు. కమిటీ నాయకులు గంపరాయి సూరయ్య, దడియా రాంబాబు,చెండా చిట్టిబాటు,అజయ్‌కుమార్,లాలీబాబు,శశిదర్ చంద్రమౌళి. పరుశురాం,గ్రామ పంచాయతీ పెద్దలు,వర్తకులు, మోటార్ యూనియన్ నాయకులు తదితరులు ఉత్సవాలు పర్యవేక్షించనున్నారు.



భక్తులకు దర్శన మిస్తున్న మోదకొండమ్మ రూపం

మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం

కె.కోటపాడు: ప్రజలు సురక్షిత ఆరోగ్యాన్ని పొందేందుకు మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవా లని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సుబ్రహ్మ ణ్యం తెలిపారు. శనివారం ఎ.భీమవరం గ్రామంలో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం నిర్వహించారు. 122 మందికి వైద్య పరీక్షలతోపాటు మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా బి.పి, సుగర్ పరీక్షలతోపాటు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. వర్షాకాలం దృష్ట్యా ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించుకునేందుకు ప్రజలు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డీఎస్ఎస్.రాజు, రమణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజ నిర్మాణానికి కృషి

దేవరాపల్లి: మలేరియా రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి ఇ. పూజ్యమేఘన తెలిపారు. ఈ మేరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం దేవరాపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పూజ్యమేఘన మాట్లాడుతూ ఈ నెల ఒకటిన ప్రారంభమైన మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రపంచ వ్యాప్త ఆరోగ్య సమతుల్యత సాధన కోసం మలేరియా వ్యతిరేక పోరాటాన్ని సాగిద్దామన్నారు. దీనికి ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని సూచించారు. నిల్వ నీటిలోనే లార్వా వృద్ధి చెందుతుందన్నారు. ఇది వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటిలో ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. ఇళ్లలో దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వినియోగించడంతోపాటు కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేయించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. సీహెచ్‌వో పి. ప్రసాదరావు, హెచ్‌వీ బి. లక్ష్మి, పీహెచ్ఎన్ సునీత పాల్గొన్నారు.



మార్మోగిన గోవింద నామస్మరణ

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు, సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీవారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేకువజామున సుప్రభాత సేవ, తోమాల సేవ, అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కోలాటాలు, శ్రీవారి నామసంకీర్తన భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రెండో శనివారం కావడంతో లడ్డూ విక్రయాలు జోరుగా సాగాయి.